క్లుప్తంగా

ముత్యాలమ్మ కొలువులు ప్రారంభం

గురజాల : పట్టణంలో వేంచేసియున్న గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు బుధవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించడం జరుగుతుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అమ్మవారి గ్రామోత్సవం అనంతరం బియ్యం కొలువు నిర్వహించారు. వేకువజాము నుంచి ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పిడుగురాళ్ల ట్రాఫిక్ ఎస్ఐగా కృష్ణారావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ట్రాఫిక్ ఎస్ఐగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. కృష్ణారావు బదిలీలో భాగంగా పెదకూరపాడు పోలీస్ స్టేసన్ నుంచి పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ కృష్ణారావు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగుపాటుకు గేదెల కాపరి మృతి



కారెంపూడి: పిడుగుపాటుకు పొలంలో గేదెలు మేపుతున్న వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని చినగార్లపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. చినగార్లపాడు గ్రామానికి చెందిన దాసరి గంగయ్య గేదెలను మేత కోసం తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో విపరీతమైన ఉరుములు మెరుపులతో పడిన వర్షంలో పిడుగుపాటుకు గురై గంగయ్య (79) అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం గేదెలు ఇంటికి వచ్చినా తండ్రి రాకపోవడంతో ఆయన కుమారులు గాలించగా చినకొదమగుండ్ల వెళ్లే దారిలో వాగు వద్ద గంగయ్య మృతదేహం లభ్యమైంది. గంగయ్యకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. గ్రామ సర్పంచ్ బద్దూరి బుజ్జి శ్రీనివాసరెడ్డి గంగయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి



పిడుగురాళ్లరూరల్: పాము కాటుకు కౌలు రైతు మృతి చెందిన ఘటన పిడుగురాళ్ల మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వినుకొండ వెంకట్రామయ్య(49) కౌలుకు పొలం తీసుకొని జీవనం సాగిస్తున్నాడు. కౌలుకు తీసుకొన్న పొలంలో వరి పంట సాగు చేస్తున్నారు. వరి పంటకు నీళ్ల పెట్టేందుకు వెంకట్రామయ్య మంగళవారం సాయంత్రం వెళ్లగా.. పాము కాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య దేవి ఫిర్యాదు చేయగా ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎమ్మెల్యే కాసు పరామర్శ...

గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి వినుకొండ వెంకట్రామయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలియజేశారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

పిడుగురాళ్ల సీఐ ఆంజనేయులు



పిడుగురాళ్ల: దీపావళి టపాసుల విక్రయానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి టపాసులు విక్రయించే వారు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. అనుమతి లేకుండా ఎవరైనా విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా ప్రభుత్వం సూచించిన చోటనే విక్రయాలు నిర్వహించాలని అన్నారు. ఆ ప్రదేశాల్లో సేఫ్టీ పరికరాలు ఉండాలని చెప్పారు. ఇళ్లు ఉన్న ప్రదేశాల్లో విక్రయాలు కొనసాగించవద్దని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రబ్బానీ ఖాన్ తదితరులు ఉన్నారు.

వరాల వాన



వర్షం నీటితో కళకళాడుతున్న మిర్చి పంట



వర్షం పడుతున్న దృశ్యం

కారెంపూడి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మెట్ట పంటలు జీవం పోసుకున్నాయి. మంగళవారం రాత్రి, మళ్లీ బుధవారం సాయంత్రం భారీ వర్షం కురుస్తోంది. ఈ వర్షం వల్ల బెట్టకు వచ్చిన పంటలన్నింటికి జీవం వచ్చింది. ముఖ్యంగా ఎక్కువ విస్తీర్ణంలో వేసిన పూత దశకు వచ్చిన కందికి మేలు చేసింది. దీంతో సకాలంలో వర్షం పడడం వల్ల కంది పంటకు మేలు జరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెర్రలిచ్చిన పంట భూములు తడవడంతో దాదాపు పంటలన్నీ కళకళలాడుతున్నాయి. అలాగే బోర్ల కింద సాగులో ఉన్న పంటలకు కూడా మేలు జరిగింది. తీవ్రమైన ఎండల వల్ల బోరు నీటితో పంటలు తడవని పరిస్థితి నెలకొంది. గత కొన్ని రోజులుగా బోర్లలో కూడా నీటి మట్టం తగ్గింది. ప్రస్తుతం కురిసిన వర్షాలతో బోర్లలో నీటి మట్టం పెరిగింది. దాదాపు అన్ని పంటలకు ఈ వర్షం మేలు చేసింది. ముఖ్యంగా వరిలో చిలుక దోమ బెడద బాగా తగ్గింది. మిర్చి పంటకు కూడా ఇది వాస్తవంగా వరాల వానే. బోర్ల కింద సాగు చేస్తున్న రైతులకు కూడా నీరు పెట్టుకునే శ్రమ తప్పింది. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాచర్ల పట్టణంలో కొనసాగుతున్న వర్షం

మాచర్ల: పట్టణంలో బుధవారం రాత్రి 7 గంటల నుంచి భారీగా వర్షం కురిసింది. మూడు రోజుల కిందట వర్షం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నిన్న, మొన్న చినుకులు పడ్డాయి. బుధవారం రాత్రి నుంచి భారీగా వర్షం కురిస్తోంది. రోడ్లు, గుంతలు, డ్రైనేజీలు వర్షపు నీటితో నిండిపోయాయి. పలు చోట్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షం నేపథ్యంలో ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు. మొత్తంగా వర్షం భారీగా కురవటంపై అన్ని వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి.

వైఎస్సార్‌సీపీలో చేరిన 30 కుటుంబాలు



ఎమ్మెల్యే కాసు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జానపాడు గ్రామానికి చెందిన ఎస్సీలు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన 30 కుటుంబాలు గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో బుధవారం చేరారు. వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారందరినీ ఎమ్మెల్యే కాసు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సాతులూరి ఆదాం, శ్రీనివాసరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు, కొండలు, యోహాను, వెంకటేష్, ఇసాకు, యేసుబాబు, ఎస్.యేసుబాబు, సాతులూరి యేసుబాబు, ఈగల సైదులు, కంభంపాటి బెంజిమెన్, దున్న ప్రకాష్, మరియబాబు, సాతులూరి కోటేశ్వరరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, కౌన్సిలర్లు బాబు, ఆంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పవన్‌రెడ్డి, తురకపాలెం సర్పంచ్ షేక్ అల్లా భక్షు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు



పిడుగురాళ్ల డిపోలో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటం జరిగిందని పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని డిపోలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నవంబర్ నుంచి జనవరి వరకు శబరిమలకు పిడుగురాళ్ల నుంచి ప్రత్యేక బస్సులను నడపటం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా శబరిమల యాత్రకు బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అలాగే పంచారామాల దర్శనం కోసం కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, దైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని, ఈ సౌకర్యాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి నెల 10వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ 9959225430, ట్రాఫిక్ సూపరింటెండెంట్ 7382899792 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్‌తోపాటు సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఈవీవీఎంఎం రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

- విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయవచ్చు
- ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: విద్యార్థులకు డిజిటల్ తరగతులు వారిలో ఏకగ్రతపై నియంత్రణ సాధించి వారిలో జ్ఞాపకశక్తిని పెంపొందించడంతోపాటు వారిలో దాగిన సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఎంతగానో దోహద పడతాయని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం మండలంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా తుమృకోట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న డిజిటల్ తరగతులను పరిశీలించారు. అలాగే స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మితో కలిసి సందర్శించి ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉటూ చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అందచేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతస్థానానికి చేరుకుంటారన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలోని మారుమూల గ్రామాలలో సైతం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడానికి డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి మాట్లాడుతూ కష్టపడి అత్యున్నత స్థాయికి చేరుకున్న మహనీయులు జీవిత చరిత్రలను తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడిచి తల్లిదండ్రులకు, గ్రామాలకు గుర్తింపు తీసుకు రావాలని అన్నారు. మీకు ఏమైన సమస్యలు ఉన్నాయా...ప్రతి రోజు మెనో ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



రెంటచింతల: మండలంలోని తుమృకోట గ్రామంలో బుధవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ యువకుడు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్ఐ రాజీవ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని చింతలబావి ప్రాంతంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు వేసిన బోరులారీ తిరిగి వెళ్తున్న సమయంలో లారీపైన కూర్చున్న కూలీలు రోహిత్(20), బడియ మణికంఠన్‌లకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రోహిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కందగన్ జిల్లాలోని కలివేడ మృతుడు రోహిత్ స్వగ్రామం. తీవ్రంగా గాయపడిన బడియ మణికంఠన్‌ను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతున్నాడన్నారు. క్షతగాత్రుడు మణికంఠన్ తమిళనాడు రాష్ట్రానికి చెందినవాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజీవ్‌కుమార్ తెలిపారు.

శిఖర ప్రతిష్టా కుంభాబిషేక పూజలు ప్రారంభం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ ఫిరోజీ రుషీంద్రుల వారి మఠం వద్ద గల శ్రీ వేద గాయత్రీ దేవి అమ్మవారి దేవాలయంలో శిఖర ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవ పూజలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నారాయణ నగర సంకీర్తన వారిచే తోరణాలు కట్టి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి జోగెత్తుకొని ఎదురు నడిచారు. గురువారం శ్రీ వేద గాయత్రీ దేవి శిఖర ప్రతిష్ట అనంతరం సువాసినులకు అమ్మవారి ఒడిబాలు బియ్యం అందించనున్నారు. యాగతీర్థ ప్రసాద వితరణ చేపడతారు. రాహు గ్రస్త, కుజదోషములు నివారించి సంపూర్ణ అనుగ్రహం కలిగించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నా రు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శిఖర ప్రతి ష్టా కుంబాభిషేకం మహోత్సవంలో పాల్గొనాల ని మఠాధిపతి పులహరి బాను ప్రసాద్ కోరారు.

ఆచార్యులు నిత్య విద్యార్థులే

సత్తెనపల్లి: బోధనా రంగంలో ఆచార్యులు నిత్య విద్యార్థులేనని శ్రీ సరస్వతి విద్యాపీఠం క్షేత్ర అధికారి రావుల సూర్యనారాయణ, ఏపీ అధికారి కోవెల శ్రీనివాసాచార్యులు అన్నారు. శ్రీ సరస్వతి విద్యాపీఠం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 16 పాఠశాలలకు సంబంధించిన ఆచార్యులకు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణవర్గ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధన రంగంలో ఎప్పటికప్పుడు మెళకువలు, కొత్త అంశాలను తెలుసుకొని బోధించాలన్నారు. ఆచార్యులకు వివిధ అంశాలలో మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ బాధ్యులు కొననం జగదీష్, డాక్టర్ రాధాబాయి, డాక్టర్ జి.శ్రీధర్, జేపీఎస్ శాస్త్రి, అబ్బూరి సత్యనారాయణ, చలువాది చిన్న సత్యనారాయణ, యద్దనపూడి సుబ్బారావు, దేవరశెట్టి రవికుమార్, గోపికృష్ణ, వివిధ పాఠశాలల ప్రధానాచార్యులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులు స్వాధీనం



మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న నకిలీ పురుగు మందులను జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం గ్రామంలో నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టగా, గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ దుకాణంలో అనుమతులు లేని ఎఫ్ఎంసీ కంపెనీకి చెందిన బెనీవియా 240 మి.లీ. 20 డబ్బాలను నకిలీవిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో స్వాధీనం చేసుకున్న డబ్బాలను ప్రయోగశాలకు పంపి, నాణ్యతా ప్రమాణాలను తెలుసుకుంటామని అధికారులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.57 వేలు ఉంటుందన్నారు. నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న, సరఫరా చేస్తున్న వారిపై కేసులు న మోదు చేయడం జరుగుతుందని తెలిపారు. దాడు ల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామచంద్రా రెడ్డి, ఏఓ రమణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి



గంగిరెడ్డిపాలెంలో మిరప పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ వై.మోహన్

మాచవరం: మిరపలో రసం పీల్చు పురుగు నివారణకు తక్షణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో మిరప పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మిరపలో రసం పీల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. తామ ర పురుగు నివారణకు రైతులందరూ సామూహికంగా మిరప తోటల్లో నీలిరంగు, పసుపు రంగు, తెలుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతిని గమనించాలన్నారు. ఎరపంటగా ప్రొద్దు తిరుగుడు మొక్కలను వేయాలని సూచించారు. సస్యరక్షణకు అజాడిరెక్టిన్ 10వేల పీపీఎంను లీటరు నీటికి 2 మి.లీ. సర్ఫ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. జీవశిలీంద్రాలైన బవేరియా బసియానా 5 గ్రాములు, వర్టిసిలియంలేకాని 5గ్రా. పంచగవ్య 30 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లనల్లి, తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వీఏఏలు నరసయ్య, కరుణకుమారి, రైతులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కలెక్టర్ శివశంకర్ సత్రశాల రాక

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గురువారం ఏర్పాటు చేస్తున్న బహిరంగ విచారణకు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ రానున్నట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు 2,500 టన్నుల సిమెంట్‌ను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీని 4 వేల టన్నులకు అభివృద్ధి(విస్తరణ) చేయడంలో భాగంగా ఈ బహిరంగ విచారణను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

నిబంధనలు పాటించండి.. అనుమతులు పొందండి



మాచర్ల: పట్టణంలో అను మతులు లేకుండా ఎక్క డా దీపావళి మందులు అమ్మకూడదని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ పి.శరత్‌బాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ దీపావళి మందులు కాల్చుకు నే ప్రజలు ఎక్కడా ఇబ్బంది పడకూడదన్నారు. బాణసంచా విక్రయించేవారు ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అనుమతులు తీసుకొని విక్రయించాలన్నారు. అనుమతులు లేకుండా షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రతి ఒక్కరూ బాణసంచా విక్రయాలకు సంబంధించి పలు జాగ్రత్తలు తీసుకొని అనుమతి పొందాలని కోరారు.

నీటిని పొదుపుగా ఉపయోగించండి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: మంచినీటిని ప్రతి ఒక్కరు పొదుపుగా ఉపయోగించి భవిష్యత్ తరాలకు నీరు అందించాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని చెరువు కట్ట బజారులో వాటర్ పంప్ హౌస్ వద్ద స్వయం సహాయక సంఘాల మహిళలకు మంచినీటి ఉపయోగంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ దివాలి కార్యక్రమంలో భాగంగా నీటి పొదుపుపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సూచించారు. ప్రధానంగా పిడుగురాళ్ల పట్టణంలో ప్రజలకు మంచినీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో 20 కిలోమీటర్ల దూరంలో గోవిందాపురం వద్ద ఉన్న కృష్ణానది నుంచి రూ. 40 కోట్లతో మంచినీటి ప్రాజెక్టును నిర్మించి కృష్ణా జలాలను పిడుగురాళ్ల ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఇందుకుగాను కరెంట్ బిల్లు, అధికారులకు, మున్సిపల్ సిబ్బంది, మెయింటెనెన్స్‌కు ప్రతి నెల రూ.20 లక్షల ఖర్చు అవుతుందని, ఇంత ఖర్చుతో శుద్ధి చేసిన నీటిని పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు అందిస్తున్నాం, అందుకే ప్రతి ఒక్కరు నీటి పొదుపు పాటిస్తే భావితరాలకు నీటి కొరత ఉండదని తెలిపారు. పొదుపు గ్రూపు మహిళలందరు నీటి పొదుపుపై అధికారులు అందజేసిన అవగాహన తమ పొదుపు సభ్యులతోపాటు ఇరుగుపొరుగు వారికి తెలియజేసి ప్రతి ఒక్కరు నీటి పొదుపు చేసేలా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి 16వ వార్డు కౌన్సిలర్ కత్తెరవు వాసుదేవరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం శ్రీనివాసరావు, పీవో శ్రీనివాసరావు, కౌన్సిలర్ ముక్కంటి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి, ఏఈ రాఘవేంద్ర, సచివాలయ సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి



సత్తెనపల్లి: బడి బయట ఉన్న విద్యార్థులు, చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు మళ్లీ తిరిగి చదువుకునే మంచి అవకాశం ఓపెన్ స్కూల్ ద్వారా ఉందని రాష్ట్ర ఓపెన్ స్కూల్ సమన్వయకర్త అక్బర్ అలీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపై ఆసక్తి ఉన్న అర్హత కలిగిన వారందరూ ఓపెన్ స్కూల్ ఉపయోగించుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ ప్రాధాన్యత వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త కేఎంఏ హుస్సేన్, కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.సాంబయ్య, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

రైలు పట్టాలను దాటడం చట్టరీత్యా నేరం

- రాజుపాలెంలో నూక్కడ్ నాటకాల ద్వారా అవగాహన కల్పించిన రైల్వే శాఖ
- వివరాలు వెల్లడించిన డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ



మండలంలో స్థానికులకు నూక్కడ్ నాటకాల ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి రాజుపాలెం గ్రామంలో రైలు పట్టాలు దాటడం వల్ల కలిగే ప్రమాదాలు, పలు రకాల అంశాలపై నూక్కడ్ నాటకాలు డివిజన్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ సేఫ్టీ ఆపరేటింగ్ అధికారులు నిర్వహించడం జరిగిందని డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. సత్తెనపల్లిలోని రాజుపాలెం, సిరిపురం గ్రామాలలో బుధవారం నూక్కడ్ నాటకాల ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మిర్యాలగూడ-నల్గొండ సెక్షన్ మధ్య ట్రాక్టర్ రైలు పట్టాలపై ఇరుక్కుపోయిందని దానిని తొలిగించేందుకు చాలా సమయం పట్టిందని ప్రయాణికులు అసౌకర్యానికి గురైనట్లు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై రైలు వచ్చే సమయంలో రైలు గేటు వేసి ఉన్న పలు ప్రాంతాలలో పశువులను, పట్టాలు తప్పించడం, వాహనాలు దాటించడం చేస్తున్నారని దాని వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రైల్వే నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీవ్రతరంగా ఉంటాయన్నారు. ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా కోరారు. రైలు వచ్చి పట్టాలపై నుంచి వేళ్ళే 5,10 నిమిషాల వ్యవధి వరకు వేచి ఉండాలని రైలు వచ్చు సమయంలో పట్టాలు దాటే యత్నం చేయడం నేరం అని తెలియజేశారు. ఇటువంటి ఘటనలు జరుగకుండా గ్రామీణ ప్రాంతాల వారికి నూక్కడ్ నాటకాలను చేస్తూ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే మన తోటి ప్రయాణికులు అసౌకర్యానికి గురయిన, ప్రమాదం సంభవించిన వారి కుటుంబాలు రోడ్డు పాలు అవుతాయని అలా జరుగకుండా ఉండాలంటే రైల్వే నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాల్సిందిగా తెలిపారు. అనంతరం నూక్కడ్ నాటకాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీజర్ విజయ కీర్తి, కళాకారులు, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు జెడ్పీ స్కూల్ విద్యార్థులు



అచ్చంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ, రెజ్లింగ్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికై న విద్యార్థులను బుధవారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎ.సుధారాణి, పీడీ ఆలపాటి సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 7వ తేదీన కొమెరిపూడిలో జరిగిన అండర్ 17 బాలికల విభాగం, కబడ్డీ పోటీలలో పి.కవిత, అచ్చంపేట గురుకుల పాఠశాలలో జరిగిన అండర్ 19 రెజ్లింగ్ పోటీలలో షేక్ రబ్బాని ఎంపికైనట్లు పీడీ సుజాత తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఇరువురు విద్యార్థులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.